# బంధం

## - డా.దుట్టా శమంతకమణి

"అ రోజు ముహూర్తాల్లేవు బాబూ"

"భారతదేశమంతా రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు జరుపుకునే సమయంలో మా వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకోవడం అద్భుతంగా ఉంటుంది. అయినా, పంతులుగారూ ముహూర్తబలం చూసి చేస్తున్న పెళ్ళిళ్ళన్నీ విజయవంతం అవుతున్నాయా? భార్యాభర్తల మధ్య అనురాగం, అవగాహన ఉంటే ఆ దాంపత్యం చల్లగా ఉంటుంది గానీ..." అంటూ పట్టుబట్టి తమ వివాహం జరిపించుకున్నాడు మహేష్.

అతని సాహచర్యంలో అయిదేళ్ళు అయిదురోజుల్లాగా గడిచిపోయాయి.

"అలా గుడ్లప్పగించి క్యాలెండర్ వైపు చూడక పోతే నా ముఖాన కాఫీ కొట్టేదేమైనా ఉందా?" అందమైన అతని ముఖంలో వికృతంగా కన్పించే భావాలు చూడలేక, మౌనంగా కిచెన్‌లోకి దారితీసింది అపరాజిత. హఠాత్తుగా మారిన అతని ప్రవర్తనకు కారణాలు అర్థమైనా, రోజురోజుకీ మారుతున్న అతని స్వభావాన్నీ, వ్యక్తిత్వాన్నీ అంచనా వేస్తోంది. ఎంతైనా చదువులో యూనివర్శిటీ గోల్డ్ మెడలిస్ట్ కదా.

"టిఫిన్ ఏం చేయమంటారు?"

"నాకాకలిగా లేదు"

"మధ్యాహ్నం వంట?"

"నీకిష్టమైనవి చేసుకో. నేను లంచ్ బయటచేస్తాను"

"ఈరోజు మన పెళ్ళిరోజండి"

"అన్నీ బావుంటే మన బిడ్డ నాలుగో పుట్టిన రోజు కూడా అయిపోయుండేది"

మిస్సైల్‌లా దూసుకొచ్చిన ఆ మాటలకు ఆమె అంతరంగం అల్లాడిపోయింది. భార్యగా కాదు. కనీసం సాటి వ్యక్తిగా కూడా ఆమెను గౌరవించడం లేదు. గతరాత్రి సంభాషణే 'పచ్చిగా' గాయం మానకుండా ఉంది.

"అపరాజితా ఈ ఇల్లు మీ నాన్నగారు నీ పేరునే రిజిష్టర్ చేయించారు కదూ"

"అవును"

"ఏమీలేదు.." అర్థోక్తిలో ఆగిపోయాడు మహేష్.

గత మూడునెలలుగా చాలా రఫ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈరోజే కాస్త సౌమ్యంగా మాట్లాడుతున్నాడతడు.

"ఇల్లు మీ పేరున ట్రాన్స్‌ఫర్ చేయించమంటారా?"


"నో! నో! కాదు" బ్యాగ్‌నుండి బ్యాంక్ పాస్‌బుక్ తీశాడు.

"ఇందులో మన పెళ్లి సమయంలో మీ నాన్నగారిచ్చిన రెండులక్షలు డిపాజిట్ చేశాను. అలాగే ఇంట్లోకి మెయింటెనెన్స్ ఇస్తాను. నీకు తెలుసుగా. నాకు పిల్లలంటే ప్రాణం. వాళ్ళు లేని జీవితం నా ఊహకందడం లేదు. నీ వలన ఆ ఆశ నెరవేరే అవకాశం లేదని డాక్టర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. అందుకే నేను వేరే పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. నీవు విడాకులిస్తే అధికారికంగా చేసుకుంటాను. లేదంటే అలా అంగీకరించే వ్యక్తినే నా జీవితంలోకి ఆహ్వానిస్తాను"

తమ ఐదవ యానివర్సరీ గురించి మాట్లాడుతున్నాడతను అనుకున్న అపరాజిత 'పాత షర్ట్ స్థానంలో కొత్త షర్టు' అన్నంత తేలికగా మాట్లాడుతున్న ఆ ఇంజనీర్‌ని చూస్తూ 'ఇది చెప్పడానికి ఎంత రిహార్సల్ చేశాడో' అనుకుంది.

★ ★ ★

నాలుగున్నర సంవత్సరాల వైవాహిక జీవితము రిపాలకు సాక్షి అయిన ఆ మంచం గత ఆరునెలలుగా ఎడమొహం, పెడమొహాలను కూడా చూస్తోంది. తల్లీదండ్రుల ఏకైక సంతానం అపరాజిత. ఉద్యోగస్థులైన భార్యాభర్తల బిజీ షెడ్యూల్



తమ ఇంట్లోనే చూసిన ఆమె గృహిణి గానే ఉండాలనుకుంది. ఆమె నిర్ణయానికి అనుగుణంగానే ఇంజనీరైన మహేష్‌కిచ్చి ఇల్లు, ఫర్నిచర్ రెండులక్షల నగదు ఇచ్చి ఏ లోటూ రాకుండా ఘనంగా వివాహం చేశారు. ఇదంతా ఆమె స్వంతం. అయినా ఈరోజు తన ఇంట్లో తానే పరాయిదైన భావం. డ్రాయింగ్‌రూంలోకి అపరాజిత..టేబుల్‌పై సగం చదివి వదిలేసిన గోర్కి అమ్మ.

ప్రపంచంలో ఎక్కడైనా అమ్మ...అమ్మే. ఒడిలో బిడ్డను చూడాలని మాతృత్వపు మధురిమలు తాను అనుభవించాలని ఈప్రపంచంలో ప్రతి స్త్రీ కోరుకుంటుంది. ఆ కల కొందరికి నెరవేరుతుంది. కొందరికి నెరవేరదు. మెడికల్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత విషయాన్ని అతనికి యథాతథంగా తెల్పమని వాళ్ల ఫ్యామిలీ డాక్టర్, జీవితాన్ని ఎంతో చూసిన అపరాజిత తల్లి నచ్చజెప్పారు. కానీ వైవాహిక జీవితాన్ని ముక్కలు చేసుకోవడం తనకీ ఇష్టం లేకపోయింది. ఈరోజు ఏం జరిగింది? మహేష్‌ని డిస్టర్బ్ చేయదలుచుకోలేదు తను. కానీ మహేష్-

"ఏమిటీ? నీకు తల్లయ్యే అర్హత లేదా?'' అంటూ అతను చూసిన చూపు తమ మధ్య అగాథానికి తొలిమెట్టు.

"నూరుకోట్ల భూభారంతో కృంగిపోతున్న భారతమాతకు మనం భారం పెంచడం లేదండి'' అంటూ నవ్వుతూ తేల్చబోయింది.

నవ్వులు, పువ్వులతో విరాజిల్లిన తమ ఇంట్లో అదే ఆఖరి నవ్వు అవుతుందని ఊహించలేదు ఆనాడు.

స్కూటర్ వెళ్ళిపోయిన చప్పుడు విన్పించింది.

★ ★ ★

అసహనంగా మ్రోగుతున్న కాలింగ్ బెల్‌కి మెలకువ వచ్చింది. తలుపు తీసింది.

"అసురసంధ్యవేళ ఇంట్లో లైట్ వేయకుండా ఏం ఘనకార్యం వెలగబెడుతున్నావ్?'' విసుగ్గా వచ్చింది ప్రశ్న.


"పరస్పరం ఇష్టపడితే విడాకులు త్వరగా శాంక్షన్ అవుతాయట. లాయర్ చెప్పారు'' తమ యానివర్శరీ బహుమతిగా అందిస్తున్న అతని చేతిలోని కవర్ అందుకోవాలో, లేదో తెలియలేదు.

కవర్ టేబుల్‌పై పెట్టి లోపలికి వెళ్ళిపోయాడు మహేష్. తేలిపోయింది. ఇక నీ అవసరం లేదంటూ తేల్చిచెప్పాడు. సంతానవతివి కాలేవు గనుక జీవితం లోనుంచే తొలగిపొమ్మన్నట్టు తల్లిదండ్రులు, అత్తమామలు, అందరూ సర్దిచెప్పి కాపురం చేయించవచ్చు. కానీ కేవలం ఒకే ఒక్క కారణం చేత, నీలో జీవితం నాకవసరం లేదంటున్న వ్యక్తితో జీవించడం అంత అవసరమా? మూడుముళ్ల బంధం ముక్కలైన తర్వాత ఎన్ని ముడులు వేసినా అవి ముడులే. డైవోర్స్ పేపర్లపై సంతకం చేసేసింది అపరాజిత.


★ ★ ★

కాలగమనంలో ఏడువసంతాలు వెళ్ళిపోయాయి

.సుప్రభాతాన కన్యాకుమారి అమ్మవారికి జరిగే పూజలో పాల్గొని, పడవపై వివేకానంద రాక్ చేరారు.



కథా నిలయం



## ఆసక్తి

కాశ్మీరాషా నటిస్తున్న కొత్త చిత్రాలేమిటో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్‌కి చెందిన రైటర్, ప్రొడ్యూసర్ బ్రాడ్ లిజర్‌మన్ నిర్మిస్తున్న 'మై బాలీవుడ్ బ్రైడ్'లో కాశ్మీరాషా నటిస్తోంది. ముంబై ఫిల్మ్‌సిటీలో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం డ్రీం ట్రీం లిమిటెడ్ పేరుమీద నిర్మాణం జరుపుకుంటోంది. సంజయ్‌సూరి, గుల్షన్‌గ్రోవర్, జావెద్‌ఖాన్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు. పూర్తి హాలీవుడ్ సాంకేతిక విలువలతో నిర్మితమవుతున్న ఈ చిత్రం కాశ్మీర్‌షాకి కొత్త అవకాశాల్ని తెచ్చిపెడుతుందేమో కాలమే సమాధానం చెప్పాలి.

ఎదురుగా అమ్మవారి కోవెల. నీటిపై తేలియాడుతున్న రంగురంగుల పడవలు, ప్రశాంతంగా ఉంది మానసం.


"అపరాజితా బావున్నావా?" జ్ఞాపకాల అడుగున పడిన కంఠధ్వని. వెనుదిరిగి చూస్తే పదేళ్ళ వయస్సు మీద బడినట్లున్న మహేష్.

"నువ్వు! మళ్ళీ పెళ్ళి" సందేహాస్పదంగా ఆగిపోయాడు.

"మీరు కోరుకున్న జీవితం మీకు దక్కిందా?" ఆమెనుంచి వచ్చిన ప్రశ్నకు గుండె గొంతుకలోకి వచ్చిందతనికి. 'ఏం చెబుతాడు? పిల్లల కోసం మళ్లీ పెళ్ళి చేసుకున్న అతనికి లోపం తనదేనని ఆలస్యంగా తెలిసిందని చెబుతాడా? డాక్టర్ రిపోర్ట్సులో విషయం అపరాజిత దాచి, లోపం తన మీద వేసుకుందన్న విషయం ఆలస్యంగా తెలిసిందని చెబుతాడా? ఆధునిక వైద్యం అతని విషయంలో చేతులెత్తేసిందని, తెలుసుకున్న రెండవభార్య నువ్వు నిస్సంతుడివి కాబట్టి నీతో ఉండలేనని వెళ్ళిపోయిందని చెబుతాడా? అపరాజిత విషయంలో చేసిన తప్పుకి అతని అంతర్మాత నిరంతరం వేధిస్తోందని, మనశ్శాంతి కోసం చేస్తున్న ప్రయాణాల గురించి చెబుతాడా? అపరాజిత అరుదైన వ్యక్తిత్వం, ఆమెతో గడిపిన దాంపత్య జీవితం తాలూకు జ్ఞాపకాలలోనే తన మనుగడ సాగుతోందని చెబుతాడా?'

"ఆరేళ్ళుగా నీకోసం గాలిస్తూనే ఉన్నాను అపరాజితా! ఆ ఇల్లు అమ్మేసి మీరు నార్త్ ఇండియా వెళ్ళిపోయారని తెల్సింది. అప్పటినుంచీ మీ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ ఎవ్వరూ మీ అడ్రస్ ఇవ్వలేకపోయారు. ఒక్క విషయం నన్ను నిరంతరం వేధిస్తూనే ఉంది. డాక్టర్ రిపోర్ట్ గురించి నువ్వు నాకు ఆరోజే చెప్పి ఉంటే బావుండేది కదా! ఎందుకు ఆ విషయం దాచావు? ఆ సందేహం నా గుండెల్లో అలాగే నిలిచిపోయింది. నువ్వు యథాతథంగా విషయం చెప్పి ఉంటే నా ప్రవర్తన సరిదిద్దుకునేవాడినిగా?" అన్నాడు మహేష్.

"ఓహో! లోపం మీదైతే ప్రవర్తన సరిదిద్దుకునేవారన్నమాట. శభాష్. చూడండి మిస్టర్ మహేష్! పిల్లలు జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. వాళ్ళవలన సంఘంలో తల్లిదండ్రులుగా హోదా, వారి పెంపకంలో ఆనందం, జీవితం చరమాంకంలో ఒంటరితనం లేకుండా మన అనే రక్తసంబంధీకులను ఏర్పరచుకోవడం జరుగుతుంది. అంతవరకే. కానీ మీరేం చేశారు? లోపం నాదని తెలియగానే రెండో అభిప్రాయం తెలుసుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. అందుకే నేను మీకు నిజం చెప్పలేదు. పిల్లలు కావాలన్న మీ ఆశ నిరాశ అయ్యేసరికి భరించలేకపోయారు. అందుకే నా భవిష్యత్తు గురించి బెంగపడలేదు. మీలోని రెండవ పార్శ్వాన్ని చూసిన నేను మీ హిపోక్రసీ భరించలేకపోయాను. అందుకే విడాకుల పత్రాలపై సంతకం చేసేశాను. మీరు కోరుకున్న తీరం వైపు మీరు వెళ్ళిపోయారు. భగవంతుడు నాకిచ్చిన దానిని స్వీకరించాను నేను" నిశ్చల స్వరంలో చెబుతున్న ఆమెను అలా చూస్తూ ఉండిపోయాను. ఆమె మెడలోని తాళి, నల్లపూసల గొలుసు చూస్తూ తన జ్ఞాపకాల నీడలోనే అపరాజిత జీవిస్తుందని అనుకున్న మహేష్ మేల్ ఇగో సంతృప్తి పడింది.




"మమ్మీ! డాడీ వివేకానంద లిటరేచర్ తీసుకున్నారు. నేను అమ్మమ్మ, తాతయ్యకు ఈ క్యాలెండర్ తీసుకున్నాను. హౌ ఈజ్ ఇట్?" మాట్లాడుతున్న ఆ బాబులో అపరాజిత రూపురేఖలు స్పష్టంగా కనబడుతున్నాయి.

"మహేష్ ఇక్కడున్నావా? చెప్పకుండా వచ్చేయడమేనా?" అన్న ప్రశ్నకు, ఇక్కడ తనను పలకరిస్తున్నదెవరబ్బా? అన్న ఆశ్చర్యంతో వెనుదిరిగాడు మహేష్.

ఎవ్వరో అపరిచితుడు మంచి పర్సనాలిటీతో, ఠీవిగా ఉన్నాడు.

"రాజీ! ఎవ్వరు వీరు?"

"తెలుగు వాళ్లండి. వాళ్ల వాళ్లు తప్పిపోయారుట. వెదుకుతూ ఇలా వచ్చారు"

"హలో! ఐయామ్ లెఫ్టినెంట్ కల్నల్ రాజేష్. మా అపరాజిత ఎవ్వరితో ఎక్కువగా మాట్లాడదు. ఆమె పరిచయం సంపాదించారంటే రియల్లీ గ్రేట్. నైస్ టు మీట్ యు" స్నేహపూర్వకంగా సాచిన అతని చేతిని అందుకుంటూ.

"థైది వే! నా పేరు మహేష్ అని మీకెలా తెలుసు?' కుతూహలంగా అడిగాడు మహేష్.

"వ్వాట్! మీ పేరు కూడా మహేషా? నేను పిల్చింది మా బాబుని. వాడిపేరు కూడా మహేష్. మా జీవితాలకు మూలం ఈపేరు... అందుకే బాబు పుట్టినప్పుడు అపరాజిత ఈపేరు పెడదామంటే వెంటనే ఒప్పుకున్నాను. నవమాసాలు మోసిన కన్న తల్లి కోరికను ఎందుకు కాదనాలి? సో శాంక్షన్ చేసేశాను. ఎనీవే. మా బాబు పేరున్న మీరు అందునా తెలుగువారు పరిచయం కావడం రియల్లీ హ్యాపీ!"

"రాజీ! వెళదామా? ట్రైన్ టైమవుతోంది" అంటూ బాబుని ఒక చేత్తో, మరొక చేయి అపరాజిత భుజాల చుట్టూ వేసి ముందుకు సాగుతున్న రాజేష్‌కి 'తన గురించి తెలుసో, తెలియదో?' వెళ్ళిపోతున్న ఆ ముగ్గురినీ వెర్రిగా చూస్తూండిపోయాడు సీనియర్ మహేష్.

★